# కార్మిక నాయకుడి జననం

"ఆమంచర్ల"

'ఇదిగో, చూచావా, బుద్ధీ!'

'చిత్తం, బాబయ్యా'

'మనమున్నామే......'

'చిత్తం, చిత్తం'

'సిసలైన అహింసావాదులం...'

'కాదు మరి! తమ బోంట్లు వుండబట్టే కదూ, బాబూ! కాంగిరేసుకు పలుకుబడీ ప్రాభల్యం వచ్చింది ... తమ బోటి కాంగ్రెసువాదుల త్యాగాలవల్లే కదూ, మనకు యీ నాటికి సిసలైన ప్రజా ప్రభుత్వం ప్రాప్తించింది.

'అదికాదు, బుద్ధీ'

'చిత్తం, చిత్తం'

'మనకు కార్మిక రంగంలో ఎంత పలుకుబడి వుందో నీకు తెలుసా?'

'అదేంటి బాబూ! అలా చలవిత్తారు, బాబులను చూస్తే కార్మికులు ఏలా యూవగించుకొంటారో తెలుసుగా!'

'ఏమన్నావ్...'

'తమరు పెట్టుబడిదార్లనీ, ప్రభుత్వం పెట్టుబడిదారుల చేతుల్లో వుందనీ, బీద ప్రజలికి ఏ యిధంగా ఉపకరించటం లేదనీ, మొన్న సత్రం ఎదురుగ్గా ఎవరో వుపన్యసిచ్చారు కదూ ప్రభూ'

'ఛీ, నోరు ముయ్!'

'చిత్తంబాబూ, చెంపలేసుకుంటున్నా ప్రభూ'

'మనమూ నాయకులం...'

'అసలైన కార్మిక నాయకులే కదు బాబూ'

'మంచి మాట చెప్పేవు బుద్ధీ!'

'చిత్తం, బాబయ్యా...'

'మనం కార్మిక రంగంలో అకుంఠిత ప్రజా నాయకులుగా అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాలి...బుద్ధీ. ఇందుకుగాను మనం కొత్త లేబర్ పార్టీని లేవదీసి ప్రపంచ ఖ్యాతి నొందాలి.'

'అదేంటి బాబయ్యా! పుట్టకొక్కుల్లాంటి సంఘాలెన్నో వున్నాయిగా, తమ చేతికింద అయినా అచ్చన్న మన దగ్గరుండగా మనకేంటి భయం, బాబయ్యా.'

'ఛీ నోరుముయ్, వెధవలకందరికీయిదేరోగం.'

'క్షమించాలి బాబయ్యా, అయితే బాబూ మీరు ఒక కొత్త పార్టీని పుట్టిస్తారా.'

'మరి ఏమిటనుకున్నావ్, మనం సర్వ సమర్థులం. అపరబ్రహ్మలంటే నమ్ము. పుట్టించగలం, యిట్టే గిట్టించగలం.'

'చిత్తం చిత్తం. బాబయ్యా, నాకు తెలువనూ, ఏలినోరి గొప్పతనం నిన్న ప్రకాశం పంతులుగోరు కూడా అదే శెలవిచ్చారు బాబయ్యా, తాము ఎటు పడితే అటు వ్రాయగల సమర్థులనికూడా పొగిడారు.'

'అవును బుద్ధీ, ప్రకాశం పంతులు యిన్నాళ్లకు నిజం చెప్పాడు! మరి అంకటితో అయిపోతుందా! ఒక పార్టీని మనం స్థాపించి, నెహ్రూ, పటేలు మొదలయిన బడానాయకులకు మెమోరేండంలు సమర్పించుకొని వారి దీవనలతో భారతదేశ ప్రతినిధిగా మన పార్టీ తరఫున అంతర్జాతీయ కార్మికసంస్థ సమావేశమునకు హాజరై, బల్లగుద్ది ఉపన్యాస మివ్వాలి..."

"చిత్తం బాబయ్యా, అప్పుడే తమరి పేరు పెతీ పత్రికలో పెద్దఅచ్చరాల్తో పడిపోతుంది."

"బలే చెప్పేవు, బుద్ధీ."

"అయితే బాబూ, మన పార్టీలో చెప్పుకో తగ్గమంది చేరుతారా! ఆంధ్ర ప్రజలంతా ప్రకాశం పంతులుగారిని మోసం చేసేరని చాలా కోపంగా వున్నారు బాబయ్యా."

'ప్రజలకు బుద్ధిలేదు, బుద్ధీ! అంతా గొఱ్ఱె దాటు. అయినా దానికేంలే బుద్ధి! దొంగ సంతకాలతో మన రికార్డులు నింపేద్దాం. మన పార్టీకి లక్షమంది మెంబర్లని నెహ్రూ చేత చెప్పిద్దాం. అయినా, ప్రకాశం పంతులు కలకాలం ఉట్టి కట్టుకు ఊరేగుతాడా బుద్ధీ! అప్పుడు నెహ్రూ మనకే పట్టం కడతాడు బుద్ధీ'

'చిత్తం బాబయ్యా. అప్పుడు తమ ధాటీకి ఆచార్య రంగా ఆగలేదు బాబూ!'

'ఎట్టయినా బుద్ధిశాలివే బుద్ధీ.'

'చిత్తం. చిత్తం. అప్పుడు బాబయ్యా! తమకు మెడనిండా...హారాలే బాబయ్యా!'